సాక్షి ప్రకాశం

శనివారం ၊ 9 ၊ సెప్టెంబర్ ၊ 2023



స్కూల్ బస్ ఢీకొని బాలుడు మృతి

స్కూల్ బస్సు ప్రమాదవశాత్తు ఢీకొని బాలుడు మృతిచెందిన ఘటన దర్శి మండలం కట్టుబడివారిపాలెంలో జరిగింది.

- 8లో..



ఉత్సాహంగా రాష్ట్రస్థాయి పోటీలు

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ఒంగోలు మినీస్టేడియంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన జట్లు పోటీల్లో పాల్గొన్నాయి.

- 8లో..

గరిష్టం/కనిష్టం 36/28

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఏపీజీఈఏ జిల్లా చైర్మన్‌గా ఎండ్లూరి



జిల్లా కమిటీతో రాష్ట్ర చైర్మన్ వెంకటరామిరెడ్డి

ఒంగోలు సబర్బన్: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా చైర్మన్‌గా ఎండ్లూరి చిట్టిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఒంగోలు నగరంలో నిర్వహించిన కార్యక్రమానికి ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ కాకర్ల వెంకట రామిరెడ్డి హాజరై జిల్లా కమిటీకి పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండ్లూరితో పాటు పూర్తి స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. జనరల్ సెక్రటరీగా ఆవుల రాధాకృష్ణ, ట్రెజరర్‌గా కే.ప్రభాకర రావు, కన్వీనర్‌గా బంగారం వెంకట్రామిరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కమిటీని కూడా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా కె వెంగల్ రెడ్డి, జనరల్ సెక్రటరీగా జి.గురవయ్య, ట్రెజరర్‌గా వై.ఏడుకొండలు రెడ్డిలను ఎన్నుకున్నారు. జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల మహిళా కమిటీ ప్రెసిడెంట్‌గా శ్రీ లక్ష్మీ, జనరల్ సెక్రటరీగా యూ.ఉమా కాత్యాయిని, ట్రెజరర్‌గా సుప్రియ, ఒంగోలు నగరం నుంచి పాలెం రాజు, ఎస్‌కే.రసూల్, భరత్, శ్రీకాంతులు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా సుమతి



ఆరికట్ల సుమతి (ఫైల్)

ఒంగోలు: ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా ఆరికట్ల సుమతి నియమితులయ్యారు. ఈనెల 6,7 తేదీల్లో బెంగళూరులో జరిగిన జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈమెను ఎంపికచేస్తూ జాతీయ కార్యదర్శి డేవిడ్ ప్రేమ్‌నాథ్, రాష్ట్ర కార్యదర్శి సైకం రాంప్రసాద్ చేతులమీదుగా ఉత్తర్వులు జారీచేశారు. అసోసియేషన్‌కు తొలి మహిళా అధ్యక్షురాలు ఈమె కావడం గమనార్హం.

డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: జిల్లా న్యాయసేవాధికార సంస్థలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిలో అర్హత కలిగిన న్యాయవాదుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎ.భారతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన దరఖాస్తుదారులు సొంత కేసులుగానీ, మరి ఏ ఇతర రిటైనర్‌షిప్ తీసుకోవడానికి అనుమతించరన్నారు. సక్రమంగా పూర్తిచేసిన దరఖాస్తు ఫారంతోపాటు స్వీయ ధ్రువీకరణతో సంబంధిత నకళ్ల పత్రాలను చైర్‌పర్సన్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, ప్రకాశం జిల్లా, ఒంగోలు అనే చిరునామాకు ఈనెల 23వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలన్నారు. దరఖాస్తుదారుల మీద ఎటువంటి క్రిమినల్ కేసులు నమోదై ఉండరాదన్నారు.

ఇళ్లు, వాకిళ్లు, పంట పొలాలు.. వీటిలో కొన్నింటిలో సరిహద్దు వివాదాలు.. సర్వే నంబర్లతో కుస్తీపట్లు.. అడంగళ్లలో తప్పులు.. పొరపాట్లతో న్యాయస్థానాల్లో సైతం తేలని పంచాయితీలు... ఇటువంటి సమస్యలకు సరైన పరిష్కారం చూపించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పక్కాగా రీ సర్వే చేయించి విలువైన భూములున్నా అక్కరకు రాకుండా పోతున్న వాటికి అధికారిక ముద్ర వేయనున్నారు. జిల్లాలో ఈ ప్రక్రియ జోరుగా సాగుతోంది. రెండు విడతలుగా సర్వే పూర్తి చేసి మూడో విడతకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది.

- జిల్లాలో జోరుగా భూముల రీసర్వే
- ఆగస్టు 31వ తేదీ నాటికి రెండు విడతల్లో 166 గ్రామాల్లో రీ సర్వే పూర్తి
- ప్రారంభమైన మూడో దశ రీ సర్వే
- 130 గ్రామాల్లో నిర్వహించాలన్న లక్ష్యం
- రీ సర్వేతో తగ్గనున్న భూ వివాదాలు



డ్రోన్

ప్రతి భూమికి శాశ్వత హక్కు పత్రం

ఒంగోలు అర్బన్:

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు భూములు పదిలం కానున్నాయి. సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం (హైబ్రీడ్ టెక్నాలజీ)తో ఖచ్చితమైన రేఖాంశాలు, అక్షాంశాలు గుర్తించి హద్దులు నిర్ణయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 546 గ్రామాల్లో రీ సర్వే పనులు జరుగుతున్నాయి. తొలి దశలో 45 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి హద్దు రాళ్లను సైతం ఏర్పాటు చేశారు. మొత్తం 37,651.28 ఎకరాల విస్తీర్ణం రీ సర్వే చేశారు. ఆగస్టు 31వ తేదీ నాటికి రెండో దశ రీసర్వే పూర్తయింది. 121 గ్రామాల్లో 1,80,882.94 ఎకరాలను పూర్తి చేశారు. వాటిలో 40 గ్రామాల్లో హద్దురాళ్లను సైతం ఏర్పాటు చేశారు. మిగిలిన గ్రామాల్లో శరవేగంగా హద్దు రాళ్లను నాటుతున్నారు. సెప్టెంబర్ నుంచి ప్రారంభమైన మూడో విడత రీసర్వేకు జిల్లాలో 130 గ్రామాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. వచ్చే ఏడాది జనవరి 31వ తేదీ నాటికి మూడో దశను పూర్తి చేసే దిశగా అధికారులు పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నారు.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో...

సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి జిల్లా మొత్తం కవర్ అయ్యేలా 5 బేస్ స్టేషన్లు ఏర్పాటు చేశారు.



బేస్ స్టేషన్ నమూనా

ఒక్కో బేస్ స్టేషన్ సుమారు 35 కిలోమీటర్ల పరిధి వరకు సిగ్నల్స్‌ను తీసుకుంటుంది. దీంతో 5 బేస్ స్టేషన్ల ద్వారా జిల్లా మొత్తం కవర్ కానుంది. జిల్లాలో కనిగిరి, ముండ్లమూరు, కొమరోలు, కంభం, యర్రగొండపాలెం ప్రాంతాల్లో బేస్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఈ రీ సర్వేలో సర్వే ఆఫ్ ఇండియా, గ్లోబల్ పొజిషన్ సిస్టమ్, డ్రోన్ టీమ్, హై ప్రిసన్ లెవలింగ్ బృందాలతో పాటు 546 మంది మండల, గ్రామ సర్వేయర్లు పనిచేస్తున్నారు.

రీ సర్వే ప్రక్రియ ఇలా...

సర్వే జరిగే సమయంలో భూ యజమానులకు సమాచారం అందిస్తారు. దీంతో యజమానులు వారి హద్దులపై సున్నంతో గుర్తులు వేసుకోవాల్సి వస్తుంది. సర్వే అనంతరం సెటిల్‌మెంట్ ప్రక్రియ నిర్వహిస్తారు. దీనికి ఎంఎంటీ (మండల మేజిస్ట్రేట్ టీం)ను ఏర్పాటు చేశారు. దీనికి డిప్యూటీ తహశీల్దార్ ప్రధాన భూమిక పోషిస్తారు. భూములకు సంబంధించి సమస్యలుంటే వాటి డాక్యుమెంట్లు, రెవెన్యూ రికార్డులను పరిశీలించి పరిష్కరిస్తారు. అయితే కోర్టు పరిధిలో ఉన్న భూ వివాదాలను ప్రస్తుతానికి సెటిల్‌మెంట్ లేకుండా సర్వే మాత్రమే చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సర్వేలో అత్యధిక సామర్థ్యం కలిగిన డ్రోన్ కెమెరాలు వినియోగిస్తూ మొదటిగా రెవెన్యూ గ్రామాల పొలిమేరల హద్దులను గుర్తిస్తారు. ఆ తర్వాత గ్రామంలోని ప్రభుత్వ భూముల హద్దులను గుర్తిస్తారు. అనంతరం ఆవాస ప్రాంతాల్లోని ఇళ్లు, ఖాళీ స్థలాలను హద్దులతో పాటు గుర్తిస్తారు. గ్రౌండ్ కంట్రోల్ పాయింట్ల ద్వారా కచ్చితమైన అక్షాంశాలు, రేఖాంశాలను గుర్తించి డ్రోన్‌ల ద్వారా ఇమేజ్‌లను తీస్తారు. ఆ ఇమేజ్‌లతో సర్వే ఆఫ్ ఇండియా ఆర్థో రెక్టిఫికేషన్ ద్వారా పొందుపరుస్తారు. వాటి సహాయంతో మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు భూములను గుర్తించి డీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో ల్యాండ్ పార్శిల్ పటాలను ఏర్పాటు చేస్తారు. ఈ ప్రక్రియను కలెక్టర్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పర్యవేక్షిస్తున్నారు.

120 ఏళ్ల తర్వాత రీసర్వే...

బ్రిటిషర్లు 120 సంవత్సరాల క్రితం భూ సర్వే చేసి రికార్డులను ఏర్పాటు చేశారు. ఇప్పటికీ అవే రికార్డుల ఆధారంగా రెవెన్యూ యంత్రాంగం పనిచేస్తోంది. పెరుగుతున్న జనాభా, భూ సమస్యలతో తిరిగి మళ్లీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే నిర్వహించడం పట్ల సర్వత్రా అభినందనలు వ్యక్తమవుతున్నాయి. రీ సర్వేలో ప్రభుత్వ, పట్టా భూములతో పాటు అసైన్డ్, వాగు పోరంబోకు, డొంకలు, అటవీ భూములు సర్వే చేయనున్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం, రెవెన్యూ రికార్డులు పక్కా



ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. అంతే కాకుండా రెవెన్యూ రికార్డుల్లోని పొరపాట్లను సరిచేయడంతో పాటు రెవెన్యూ రికార్డులు పక్కాగా ఏర్పడతాయి. దీంతో భవిష్యత్తులో కూడా భూ సమస్యలకు తావు లేకుండా ఉంటుంది. ప్రజలు రీ సర్వేకు సహకరించి వినియోగించుకోవాలి. రీ సర్వే వలన ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేటు భూములు పదిలం అవుతాయి. బ్రిటీష్ కాలంలో చేపట్టిన రీ సర్వే తర్వాత తిరిగి ఇప్పుడు రీ సర్వే నిర్వహించడం గర్వించదగిన అంశం.

– శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్

వైభవంగా 'అచ్చ తెనుగు పదకోశం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ మారెడ్డి అంజిరెడ్డి తదితరులు

ఒంగోలు: అచ్చ తెనుగు పదకోశం పుస్తకావిష్కరణ కార్యక్రమం స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం వైభవంగా జరిగింది. యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకం రాయడం అంత సులవైన విషయం కాదన్నారు. అచ్చతెనుగు పదకోశం పుస్తక రచయిత విద్వాన్ జ్యోతి చంద్రమౌళి సేవలను ఆయన ప్రశంసించారు. తాను ఒక ప్రొఫెసర్‌గా 7 పుస్తకాలు రాశానని, అందులో ఒక పుస్తకాన్ని యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఆవిష్కరించినట్లు చెప్పారు. పాఠకుల ఆన్‌లైన్ వీక్షణ పెరిగినందున కవులు కూడా తమ పుస్తకాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సిన అవసరాన్ని వివరించారు. యూనివర్శిటీ రిజిస్ట్రార్ హరిబాబు మాట్లాడుతూ పుస్తకం హస్తభూషణం అని, అన్నింటికీ గూగులమ్మ పరిష్కారం చూపలేదని, పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించేలా ప్రత్యేక చర్యలు అవసరం అన్నారు. యూనివర్శిటీ డీన్ డి.వెంకటేశ్వరరెడ్డి, శర్మకాలేజీ హిస్టరీ లెక్చరర్ కొండా శ్రీనివాసులు మాట్లాడుతూ జాతి ఔన్నత్యానికి ప్రతీక భాష అని, అటువంటి తెలుగు భాష ఔన్నత్యానికి అవసరమైన పదకోశాన్ని రూపొందించిన జ్యోతి చంద్రమౌళి కృషి అమూల్యం అన్నారు. రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ యు.దేవపాలన , రచయిత ఎంవీఎస్ శాస్త్రి మాట్లాడుతూ అచ్చ తెనుగు పదకోశం ఆవశ్యకత ఏమిటి అనేది పుస్తకం చదివితేనే తెలుస్తుందన్నారు. మన భాష గొప్పతనాన్ని ప్రపంచానికి వివరించాల్సిన బాధ్యత కవులు, రచయితలపైనే ఉందన్నారు. పుస్తక రచయిత విద్వాన్ జ్యోతి చంద్రమౌళి మాట్లాడుతూ తెలుగుభాషలో నేడు పలు అక్షరాలు సైతం మాయమయ్యాయని, నాలో ఉన్న జ్ఞాన సంపదను పదిమందికి పంచాలనే ఉద్దేశంతోనే పుస్తకాన్ని ముద్రించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత జ్యోతి చంద్రమౌళిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రరసం అధ్యక్షుడు పొన్నూరి వెంకట శ్రీనివాసులు పుస్తకంపై సమీక్షించారు.

వైద్య సేవలు చేరువ చేసేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అనారోగ్యంతో ఉన్న వారికి చేరువగా వైద్య సేవలు అందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలను గుర్తించడం, అనంతరం అక్టోబర్‌లో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందించేలా



వీడియో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రభుత్వం ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా తొలుత వాలంటీర్లు వారి పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు వివరించాలన్నారు. వైద్య సేవల కోసం సర్వే చేసేందుకు ఏ రోజు ఏఎన్ఎం వస్తారో ప్రజలకు తెలపాలన్నారు. ఏఎన్ఎం ప్రతి ఇంటికీ వెళ్లి బాధితులకు అవసరమైన పరీక్షలు చేసి వివరాలను డాక్టర్లకు అందజేస్తారని తెలిపారు. అనంతరం నిర్దేశించిన తేదీల్లో నిర్వహించే వైద్య శిబిరాల్లో బాధితులకు తగిన వైద్య సేవలు అందిస్తారన్నారు.

సంబంధిత అధికారులంతా సమన్వయంతో పనిచేసి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. దీనిలో డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, డీసీహెచ్ఎస్ మూర్తి, క్షయ నివారణ అధికారి సురేష్‌కుమార్, డీఐఓ పద్మజ, సీపీవో వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

'యువగళం'లో శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తున్నారు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

- ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

రాచర్ల: లోకేశ్ యువగళం యాత్రలో శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తున్నారని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని పాలకవీడు గ్రామంలో శుక్రవారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. లోకేశ్ యువగళం యాత్రలో ఇటీవల రాయలసీమలోని పుంగనూరులో చంద్రబాబు కనుసన్నల్లో దౌర్జన్యాలకు పాల్పడితే, పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరంలో లోకేశ్ యువగళం పాదయాత్రలో టీడీపీ శ్రేణులు రాళ్లు, కర్రలతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు చేయడం ద్వారా ప్రజలకు భయాందోళనకు గురి చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దేశంలోనే ఆదర్శవంతమైన పాలననందిస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై నోరుపారేసుకోవడం బాబు నీచ రాజకీయాలకు నిదర్శమన్నారు. సీఎం జగన్ పాలనపై ప్రజల్లో ప్రగాఢ విశ్వాసం నెలకొందని, దీన్ని జీర్ణించుకోలేని చంద్రబాబు ఎలాగైనా గద్దెనెక్కేందుకు కుట్రపూరితమైన వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో విధ్వంసకాండ సృష్టించేందుకు నీచ రాజకీయాలను ఒడిగడుతున్నారని తెలిపారు. తనను అరెస్టు చేస్తారంటూ చంద్రబాబు ముందుగానే చెప్పుకుంటూ ప్రజల నుంచి సానుభూతి పొందాలని చూస్తున్నారని, చట్టం తన పని తను చేసుకుపోతుందన్నారు. చంద్రబాబు, లోకేశ్ ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకుని ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. దీనిపై దత్తపుత్రుడు పవన్ కల్యాణ్, మీకు అండగా ఉన్న బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి, కమ్యూనిస్టు సోదరులు కూడా ఎవరూ నోరుమెదపడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని ప్రజలకు ప్రయోజనం చేకూరేలా చంద్రబాబు, లోకేశ్ నడుచుకుంటే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్.ఖాశింబి, పాలకవీడు సర్పంచ్ పల్నాటి లతీఫ్, అర్ధవీడు ఎంపీపీ వెంకట్‌రావు, మాజీ ఎంపీపీ ఎస్.రవికుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ, అర్ధవీడు జేసీఎస్ మండల కన్వీనర్ కృష్ణరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పగడాల శ్రీరంగం, బద్దెటి ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ నందం రవి, మాజీ ఎంపీటీసీ చప్పిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మండల స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- అధికార యంత్రాంగం ప్రజలకు మరింత చేరువగా
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం (జేకేసీ) కార్యక్రమం నిర్వహిస్తోందని దీని వలన అధికార యంత్రాంగం ప్రజలకు మరింత చేరువవుతుందని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. మండల స్థాయిలో ప్రత్యేకంగా జేకేసీ కార్యక్రమం శుక్రవారం స్పందన భవనంలో నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికార యంత్రాంగాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు ఇప్పటి వరకు నియోజకవర్గ కేంద్రాల్లో ప్రత్యేక స్పందన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మరింత క్షేత్రస్థాయికి తీసుకువెళ్లేలా మండల స్థాయిలో నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 38 మండలాల్లో నిర్వహించేందుకు షెడ్యూలు రూపొందించామన్నారు. ఈనెల 8వ తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 17వ తేదీ వరకు ప్రతి బుధ, శుక్ర వారాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి సోమవారం జరుగుతున్న స్పందన కార్యక్రమాలు కూడా యధావిధిగా కొనసాగుతాయన్నారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారం కావాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్జీదారుల్లో సంతృప్తి స్థాయి పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీల పరిష్కారంపై ప్రతి శాఖలో వారానికి ఒకసారి ఆడిట్ నిర్వహించి నివేదిక ఇవ్వాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత ఇతర అధికారులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో బాలా త్రిపురసుందరీదేవి



త్రిపురాంతకంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు



త్రిపురాంతకేశ్వరి అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు



వల్లూరమ్మ ఆలయంలో వరలక్ష్మీ వ్రతం చేయిస్తున్న అర్చకులు

త్రిపురాంతకంలో లక్ష కుంకుమార్చన

త్రిపురాంతకం (యర్రగొండపాలెం): శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులు స్థానిక బాలా త్రిపుర సుందరి దేవి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, లక్ష కుంకుమార్చన పూజలు చేశారు. శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో బాలా త్రిపుర సుందరి ఆలయం, పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. అమ్మవారి దర్శనం కోసం వేకువ జాము నుంచే భక్తులు బారులు తీరారు. అమ్మవారు ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు ప్రసాదశర్మ, విశ్వం నారాయణ శాస్త్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో చెన్నకేశవరెడ్డి పర్యవేక్షించారు.

వల్లూరమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

టంగుటూరు: జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో నాల్గవ శ్రావణ శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దాతల సహకారంతో నిర్వహించిన సామూహిక వరలక్ష్మి వ్రతాల్లో 1500 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. పూజ అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ఈఓ బి.రమేష్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసులు భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకులు ఉమాశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఈవీఎంల పరిశీలన

ఒంగోలు అర్బన్: స్థానిక భాగ్యనగర్‌లోని ఈవీఎం గోదాములో ఉన్న ఈవీఎంలు, వీవీ ప్యాట్, బ్యాలెట్ యూనిట్‌లను ఎన్నికల విభాగం అధికారి శ్రీనివాసరావు శుక్రవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించిన 10,256 బ్యాలెట్ యూనిట్‌లు, 7484 కంట్రోల్ యూనిట్‌లను స్కానింగ్‌చేసి వివరాలను నమోదు చేశారు. వీటిని పూణేలోని బెల్ కంపెనీకి పంపనున్నట్లు అధికారులు తెలిపారు. వీటి స్థానంలో కొత్తవి రానున్నాయన్నారు. దీనిలో వైఎస్ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్,



ఈవీఎంలు పరిశీలిస్తున్న ఎన్నికల విభాగం అధికారి

ఇతర పార్టీల ప్రతినిధులు కాలేషాబేగ్, ఎస్‌కే రసూల్ ఎలక్షన్ డీటీ రఫీ, ఉపేంద్ర, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ


దుకాణాన్ని పరిశీలిస్తున్న సీఐ రాఘవేంద్ర

పొదిలి: స్థానిక పెద్ద బస్టాండ్ సెంటర్‌లోని అంబికా సెల్ వరల్డ్ దుకాణంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. దుకాణ యజమాని కారంశెట్టి రవి తెలిపిన వివరాల మేరకు.. గురువారం రాత్రి షాప్ మూతవేసి ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం దుకాణం తెరిచేందుకు రాగా, తాళాలు పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 12 సెల్ ఫోన్లు, రూ.70 వేల నగదు చోరీ అయినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని సీఐ రాఘవేంద్ర, కొనకనమిట్ల ఎస్సై బ్రహ్మనాయుడు పరిశీలించారు. సీసీ కెమెరా ఎందుకు ఏర్పాటు చేసుకోలేదని యజమానిని ప్రశ్నించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్రీడలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి


శిద్దా రాఘవరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నిర్వాహకులు


పోటీలో తలపడుతున్న బి.ఆశశ్రీ(ప్రకాశం), జి.పూజశ్రీ(గుంటూరు)

- మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు శిద్దా రాఘవరావు

ఒంగోలు: క్రీడల ఆవశ్యకతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శిద్దా రాఘవరావు అన్నారు. స్థానిక లార్డ్ కృష్ణా బ్యాడ్మింటన్ అకాడమీలో శుక్రవారం అండర్ 13 రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాడ్మింటన్ ఆటకు రోజురోజుకూ విశేష ఆదరణ లభిస్తోందన్నారు. క్రీడాకారులకు మంచి అవకాశాలను కూడా ప్రభుత్వం కల్పిస్తోందని చెప్పారు. లార్డ్ కృష్ణా బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులకు ఒక చక్కని వేదికను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పేరుతో గ్రామస్థాయి మొదలు రాష్ట్రస్థాయి వరకు క్రీడలు నిర్వహించి గ్రామీణ క్రీడాకారులకు సీఎం వైఎస్ జగన్ ప్రోత్సాహాన్నిచ్చారన్నారు. నేడు మరోమారు 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. లార్డ్ కృష్ణా బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపకుడు అద్దంకి మురళీకృష్ణ మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయ స్థాయికి చేరుకునేందుకు అనుగుణంగా అకాడమీని ప్రారంభించామని, ఇప్పటికే అనేకమంది జాతీయస్థాయిలో రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అంకమ్మ చౌదరి, జిల్లా అధ్యక్షుడు జేవీఎస్ లక్ష్మణ్‌రెడ్డి, పాన్యా ప్రాపర్టీస్ సీఈవో పత్తిపాటి మనీష్ తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు పోటీల వివరాలు:
స్థానిక లార్డ్ కృష్ణా బ్యాడ్మింటన్ అకాడమీలో తొలిరోజైన శుక్రవారం జరిగిన పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 231 మంది బాలబాలికలు హాజరయ్యారు. అండర్ 13 బాలుర సింగిల్స్ విభాగంలో 139 మంది, అండర్ 13 బాలికల సింగిల్స్ విభాగంలో 72 మంది, అండర్ 13 బాలుర డబుల్స్ విభాగంలో 50 మంది, అండర్ 13 బాలికల డబుల్స్ విభాగంలో 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తొలిరోజు ఆట ముగిసే సమయానికి రెండు రౌండ్లు మాత్రమే పూర్తయ్యాయి. శనివారం ప్రీక్వార్టర్స్, క్వార్టర్ ఫైనల్స్ పూర్తిచేసుకుని ఆదివారం సెమీఫైనల్స్, ఫైనల్ పోటీలు నిర్వహిస్తామని లార్డ్‌కృష్ణా బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి మురళీకృష్ణ తెలిపారు.

లోకేష్ పాదయాత్రలో
సంఘ విద్రోహశక్తులు

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె


బాలినేని శ్రీనివాసరెడ్డి


జంకె వెంకటరెడ్డి

ఒంగోలు: నారా లోకేష్ పాదయాత్రలో అడుగడుగునా సంఘ విద్రోహశక్తులు పెచ్చరిల్లుతున్నాయని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. యువగళం ఎర్రటీషర్టుల ముసుగులో ఇతర ప్రాంతాల నుంచి వీరు పాల్గొంటూ దాడులకు పాల్పడుతున్నారన్నారు. కేవలం గెలుపుపై నమ్మకం లేకనే అలజడులు సృష్టిస్తున్నారని చంద్రబాబు, లోకేష్‌పై మండిపడ్డారు. ఇటీవల రాయలసీమ ప్రాంతమైన పుంగనూరులో నిర్వహించిన విధ్వంసకాండలో ఒక కానిస్టేబుల్ ఏకంగా కన్ను కోల్పోయారని, తాజాగా భీమవరంలో ముగ్గురు కానిస్టేబుళ్ల రక్తం కళ్లజూశారన్నారు. విధ్వంసం సృష్టిస్తే పోలీసులు కాల్పులు జరుపుతారని, తద్వారా పలువురు మరణిస్తే ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చి రాజకీయ లబ్ధి పొందాలనే దుర్మార్గమైన కుట్రను చంద్రబాబు అమలుచేసేందుకు యత్నిస్తున్నారని అన్నారు. అయితే పోలీసుల సంయమనంతో వారి వ్యవహారం బెడిసికొడుతోందన్నారు. చంద్రబాబు, లోకేష్ డైరెక్షన్‌లో టీడీపీ కిరాయి మూకలు సామాన్య ప్రజలపై అరాచకంగా, పక్కా ప్లాన్ ప్రకారం దాడులు చేస్తుంటే కనీసం దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌గానీ, బీజేపీ, కమ్యూనిస్టు పార్టీల నాయకులుగానీ ఖండించకపోవడం దారుణమని అన్నారు. పైగా, టీడీపీ నాయకులు, కార్యకర్తలు దెబ్బతిన్నట్లు పచ్చమీడియా పైత్యాన్ని ప్రదర్శిస్తుండటాన్ని ప్రజలు గమనించాలన్నారు. గెలుపుపై నమ్మకాన్ని కోల్పోయి ఇతర ప్రాంతాల నుంచి మనుషులను రప్పించి విధ్వంసాలు సృష్టిస్తున్న చంద్రబాబు, లోకేష్‌లను తక్షణమే అరెస్టు చేయాలని బాలినేని, జంకె డిమాండ్ చేశారు. యాత్రల పేరుతో తండ్రీకొడుకులు ప్రాంతాల మధ్య విద్వేషాన్ని రగిలిస్తూ, స్థానికంగా ఎక్కడికక్కడ టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతూ కేవలం అధికారం కోసం రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చాలని చూడటం ఏమిటని మండిపడ్డారు. అధికారమే పరమావధిగా చంద్రబాబు, లోకేష్, దత్తపుత్రుడు రాష్ట్రాన్ని తగలబెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. వీధి రౌడీలు సైతం ఉచ్చరించేందుకు వెనుకాడే భాషను చంద్రబాబు, లోకేష్ వినియోగిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి, మంత్రులపై నోటికొచ్చిన విధంగా మాట్లాడుతున్నారన్నారు. ప్రశాంతతకు మారుపేరైన పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ప్రకాశం చౌక్‌లో లోకేష్ బహిరంగసభ అనంతరం గునుపూడి శివారులో టీడీపీ శ్రేణులు రాళ్లు, కర్రలతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారని, చివరకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఇళ్లల్లో తలదాచుకున్నా ఇళ్లల్లోకి సైతం వెళ్లి మహిళలను భయభ్రాంతులకు గురిచేస్తూ దారుణంగా కొట్టడాన్ని ఖండించారు. రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తున్న చంద్రబాబు, లోకేష్‌లను తక్షణమే అరెస్టు చేయాలని, పార్టీ కార్యకర్తల ముసుగులో ఉన్న రౌడీషీటర్లు, గూండాలను గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలని బాలినేని, జంకె డిమాండ్ చేశారు.

కారు ఢీకొని యువకుడు మృతి


ఘటనా స్థలంలో వినయ్‌బాబు మృతదేహం

ఒంగోలు టౌన్: కారు ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు శ్రీజీ కాలేజీ సమీపంలో జరిగింది. ఒంగోలు రాంనగర్‌కు చెందిన కోలా వినయ్‌బాబు (27) బైకుపై శుక్రవారం రాత్రి మద్దిరాలపాడు వెళ్లాడు. స్నేహితుడు ఫోన్ చేయడంతో అక్కడి నుంచి నాగులుప్పలపాడు బయలుదేరాడు. మద్దిరాలపాడు శ్రీజీ కాలేజీ సమీపంలో కారు ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మరణించాడు. ఒంగోలు తాలూకా ఎస్సై మల్లికార్జునరావు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దు

- సిబ్బందికి ఎస్పీ మలికాగర్గ్ సూచన

ఒంగోలు టౌన్: ఏదైనా సమస్య ఉంటే ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీసు సంక్షేమ దివస్‌లో తన దృష్టికి తీసుకురావాలని, పోలీసు కార్యాలయాల చుట్టూ తిరిగి విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని ఎస్పీ మలికాగర్గ్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలతో వచ్చిన పోలీసు సిబ్బంది నుంచి అర్జీలు స్వీకరించారు. సస్పెండ్, రిలీవ్, కుటుంబ సమస్యలను ఎస్పీకి సిబ్బంది విన్నవించుకున్నారు. ఆయా ఫిర్యాదులపై స్పందించిన ఎస్పీ.. వెంటనే సంబంధిత డీపీఓ అధికారులతో మాట్లాడారు. సిబ్బంది సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అందుకు తగిన మార్గదర్శకాలు జారీ చేశారు. ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీపీఓ ఎం.సులోచన, ఐసీసీఆర్ ఐసీ దుర్గాప్రసాద్, ఆర్‌ఐలు శ్రీహరిరెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులకు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..


ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న వీఆర్వో, సర్వేయర్

బేస్తవారిపేట: మండలంలోని చింతలపాలెం సమీపంలో తోకపల్లె–కడప హైవే రోడ్డు పక్కన ఖరీదైన గ్రామకంఠం(ప్రభుత్వ భూమి) ఆక్రమణపై తహసీల్దార్ డీవీబీ వరకుమార్ శుక్రవారం చర్యలు చేపట్టారు. ఈ నెల 5న 'సాక్షి'లో 'ప్రభుత్వ భూమి ఆక్రమణ' శీర్షికన ప్రచురితమైన కథనంపై తహసీల్దార్ స్పందించారు. ఆక్రమిత ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. విలేజ్ సర్వేయర్ డి.రసూల్, వీఆర్వో డి.పీర్సా హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. 'సర్వే నెంబర్ 150/2లో 5.02 ఎకరాలు గ్రామకంఠం భూమి ఉంది. సయ్యద్ మహబూబ్ అనే వ్యక్తి 37 సెంట్లు ఆక్రమించి వరిసాగు చేసినట్లు గుర్తించాం. కుంట పక్కన మరో ఇద్దరు 8 సెంట్ల భూమి ఆక్రమించడంతో నోటీసులిచ్చాం. ప్రభుత్వ భూమి ఆక్రమించకుండా చర్యలు తీసుకుంటాం. దీనిపై పూర్తిస్థాయి నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తాం' అని తహసీల్దార్ వివరించారు.

అంకితభావంతో పనిచేసి విజయశిఖరాలకు చేరాలి

- ట్రైనీ ఐపీఎస్ అంకితా సురానను సన్మానించిన ఎస్పీ మలికాగర్గ్
- శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా ట్రైనీ ఐపీఎస్‌కు ఘన వీడ్కోలు


ట్రైనీ ఐపీఎస్ అంకితా సురానను సన్మానిస్తున్న ఎస్పీ మలికాగర్గ్, పక్కన ఏఎస్పీలు నాగేశ్వరరావు, శ్రీధర్‌రావు

ఒంగోలు టౌన్: ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన శిక్షణ కాలంలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణలో కనబరిచి అంకితభావంతో పనిచేసి మరిన్ని విజయశిఖరాలను అధిరోహించాలని ఎస్పీ మలికాగర్గ్ ఆకాంక్షించారు. ట్రైనీ ఐపీఎస్‌గా జిల్లాలో 23 వారాల శిక్షణ పూర్తి చేసుకున్న అంకితా సురానను శుక్రవారం ఎస్పీ మలికాగర్గ్ ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖలో 5 నెలల పాటు వివిధ విభాగాల్లో శిక్షణ పొందిన అంకితా సురాన నిబద్ధతను కొనియాడారు. నేరాలు, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ నిబంధనలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ, బందోబస్తు తదితర అంశాల్లో చాలా చురుగ్గా పాల్గొన్నారని చెప్పారు. విధి నిర్వహణలో ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఒక్కోసారి ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో తెలియని సందిగ్ధ పరిస్థితులు ఎదురవుతాయని, అలాంటి క్లిష్టమైన సందర్భాల్లో మీ ముందున్న ఉత్తమమైన మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలు సవాల్‌గా మారాయని, నిత్యం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో సైబర్ నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. వినూత్న కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలందిస్తూ పోలీసు శాఖ గౌరవాన్ని మరింత పెంపొందించాలని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైం) శ్రీధర్‌రావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, డీపీఓ ఏఓ సులోచన, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ఆర్‌ఐలు శ్రీహరిరెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్ ఢీకొని బాలుడు మృతి


బాలుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రామకృష్ణ

దర్శి: స్కూల్ బస్ ప్రమాదవశాత్తు ఢీకొనడంతో మూడేళ్ల బాలుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన దర్శి మండలంలోని కట్టుబడివారిపాలెం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గణికల గురుప్రసాద్ తన పెద్ద కుమారుడు హర్షను కురిచేడు మండలం అగ్రహారంలో తిరుమల స్కూల్లో చదివిస్తున్నాడు. రోజులాగే కుమారుడిని స్కూల్ బస్ ఎక్కించేందుకు వచ్చాడు. అయితే చిన్న కుమారుడు జగద్గురు సాయి కూడా బస్ ఎక్కుతా అని మారాం చేస్తూ తండ్రి వెంట నడిచాడు. ఈ క్రమంలో బస్ వెనుక భాగాన్ని పట్టుకోబోయి కింద పడటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మరణించాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామకృష్ణ తెలిపారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా.. బాలుడి మృతి ఘటనపై కేసు లేకుండా రాజీ చేసేందుకు కొందరు టీడీపీ నేతలు విశ్వ ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. బాలుడు బస్సు వెనుక టైరు కింద పడి మృతి చెందాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. విలేకరులు సంఘటనా స్థలానికి వెళ్లేసరికి ప్రమాదానికి కారణమైన స్కూల్ బస్ అక్కడ లేదు. విలేకరులు ఫొటోలు తీస్తుండగా కొందరు అడ్డుచెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది. స్కూల్ బస్సు ఇన్సూరెన్స్ గత నెలలో ముగిసినట్లు సమాచారం.

ఉత్సాహంగా టేబుల్ టెన్నిస్ రాష్ట్రస్థాయి పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ జీవన్, స్టెప్ సీఈఓ లోకేశ్వరరావు


టేబుల్ టెన్నిస్ ఆడుతున్న క్రీడాకారులు

ఒంగోలు: రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు శుక్రవారం స్థానిక మినీ స్టేడియంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను డాక్టర్ చిడితోటి జీవన్, స్టెప్ సీఈవో ఎంవీఎస్ లోకేశ్వరరావు తదితరులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిడితోటి జీవన్ మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్ పోటీలు తొలిసారిగా ఒంగోలులో నిర్వహిస్తుండడం అభినందనీయం అన్నారు. గతంలో జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లి ఆడేవారని, కానీ నేడు మన జిల్లాకు వచ్చి ఆడుతుండడం ద్వారా జిల్లాలో పెరుగుతున్న క్రీడా సౌకర్యాలకు సాక్ష్యంగా పేర్కొన్నారు. స్టెప్ సీఈవో ఎంవీఎస్ లోకేశ్వరరావు మాట్లాడుతూ క్రీడలు క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి మంచి ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ఇండోర్ స్టేడియంలో నేడు పోటీలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. క్రీడల నిర్వహణకు తాము సంపూర్ణ సహాయ, సహకారాలు అందిస్తామని, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఉపాస్ హాస్పిటల్స్ ఎండీ ప్రకాశరావు మాట్లాడుతూ క్రీడాకారులకు అవసరమైన ప్రోత్సాహాన్ని అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ డాక్టర్ ఎస్.కిషోర్‌కుమార్, అధ్యక్షులు శ్రీప్రియ, ఉపాధ్యక్షులు కె.రవి తదితరులు మాట్లాడుతూ పోటీలు మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రతిభా పరీక్షలో విద్యార్థులు పాల్గొనాలి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- ఇగ్నైట్ యంగ్ మైండ్స్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి విద్యాశాఖాధికారులు

మార్కాపురం టౌన్: ఇగ్నైట్ యంగ్ మైండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ప్రతిభా పరీక్షకు అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కోరారు. శుక్రవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి పోటీ పరీక్షలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వ్యాసరచన, క్విజ్, ఫోక్ డ్యాన్స్ విభాగాల్లో ఈ నెల 23న మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాసరచనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులు వరుసగా రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.3 వేలు, వెయ్యి రూపాయలు, క్విజ్ పోటీల్లో విజేతలకు వరుసగా రూ.15 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు, రూ.2 వేలు, ఫోక్ డ్యాన్స్ విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలతోపాటు కన్సోలేషన్ బహుమతులిస్తామని వివరించారు. పోటీ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులను ముందస్తుగా సంసిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. ఇగ్నైట్ యంగ్ మైండ్స్ జిల్లా స్థాయి పోటీల ప్రాధాన్యతను కలెక్టర్, డీఈఓ, డీవైఈఓలకు వివరించామని, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని కోరారు. రిజిస్ట్రేషన్‌కు ఆన్‌లైన్ లింకు బ్రోచర్‌లో పొందుపరిచామని, క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పేర్లు నమోదుచేసుకోవాలని సూచించారు. హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మార్కాపురం డీవైఈఓ చంద్రమౌళీశ్వర్, ఎంఈఓలు రాందాస్‌నాయక్, టి.శ్రీనివాసులు, సుజాత, సుబ్రహ్మణ్యం, హెచ్ఎంలు సీహెచ్ మల్లికార్జున, సుధాకర్, ఇగ్నైట్ యంగ్ మైండ్స్ సభ్యులు మురారి వెంకటేశ్వర్లు, మండ్లా రామాంజనేయులు, ప్రభాకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ షెడ్యూల్ విడుదల

- విద్యార్థులను ప్రోత్సహించి పోటీలను విజయవంతం చేయాలి
- ఉపాధ్యాయులకు స్కూల్ గేమ్స్ సెక్రటరీ వనజ విజ్ఞప్తి

ఒంగోలు: జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పోటీలకు సంబంధించి డీఈఓ వీఎస్ సుబ్బారావు ఆదేశాల మేరకు షెడ్యూల్ విడుదల చేసినట్లు స్కూల్ గేమ్స్ సెక్రటరీ వనజ తెలిపారు. మండల స్థాయిలో అండర్–14 విభాగంలో బాలబాలికలకు ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు, నియోజకవర్గ స్థాయిలో ఈనెల 14, 20, 21, 22వ తేదీల్లో, అలాగే జిల్లా స్థాయిలో ఈనెల 16 నుంచి 30 తేదీ వరకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు సెప్టెంబర్ మూడో వారంలో నిర్వహించనున్నట్లు ఏపీఎస్‌జీఎఫ్ షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో నియోజకవర్గ స్థాయి పోటీలు సెప్టెంబర్ 14వ తేదీ నిర్వహించాలని స్పష్టం చేశారు. మండల స్థాయిలో ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, త్రోబాల్, వాలీబాల్, యోగా క్రీడాంశాల్లో టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా నియోజకవర్గ, జిల్లా స్థాయిలోనూ అవే 9 అంశాలపై ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు తమ విద్యార్థులు ఏయే క్రీడల్లో, ఏ కేటగిరీలో పాల్గొంటారనే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఆఫ్‌లైన్ ఎంట్రీ ఫాంలను టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ టీమ్‌కు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఏ పాఠశాలలో అయితే సెలక్షన్స్ నిర్వహిస్తారో ఆ పాఠశాలలోనే మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తామని తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలు ఆయా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సమర్పించాలని కోరారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు నేరుగా జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో పాల్గొనవచ్చని సూచించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి పోటీలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు అపుస్మా సర్వసభ్య సమావేశం

ఒంగోలు: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు కె.మాధవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా ఎన్నికైన ఎంఈఓ రామచంద్రారెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డిని సత్కరించనున్నట్లు చెప్పారు.

ఇండియా, భారత్.. రెండూ ఒక్కటే

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ నారాయణరెడ్డి
- ప్రతిపక్షాలది అనవసర రాద్ధాంతమేనని మండిపాటు


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి

ఒంగోలు: ఇండియా, భారత్ రెండూ ఒకటేనని, అందులో భారతీయ జనతా పార్టీకి వేరే అభిప్రాయం లేదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి అన్నారు. ఒంగోలులోని బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి అధ్యక్షతన శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ భారతదేశాన్ని భారత్ అంటే తప్పు ఏమిటని ప్రశ్నించారు. బీజేపీ శ్రేణులు పార్టీ ఆదేశాల మేరకు నా మట్టి–నా దేశం విజయవంతం చేయాలని కోరారు. వామపక్షాలు ప్రతిదీ రాద్ధాంతం ఎందుకు చేస్తున్నాయో అర్థం కావడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వీవీ కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు రావులపల్లి నాగేంద్రయాదవ్, ప్రధాన కార్యదర్శులు శివాజీయాదవ్, కోరంకి నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు బొద్దిలూరి ఆంజనేయులు, సెగ్గం శ్రీనివాసరావు, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కలీఫాతుల్లా బాషా, మహిళా నాయకులు పాల్గొన్నారు.